క్లుప్తంగా

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



సోమన్‌గుర్తిలో విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పూడూరు: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరహనుమాన్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, రఘురాంరెడ్డి, సుభాన్‌రెడ్డి, విశ్వనాథం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయడం హర్షణీయం



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు ఫంక్షన్ హాళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద ముస్లింలకు, వీటి నిర్మాణంతో ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సత్వరమే షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ అజర్, ఎండీ షానావజ్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.

స్కూల్ లైబ్రరీకి పుస్తకాలు బహూకరణ



బహూకరించిన పుస్తకాలతో విద్యార్థులు

బంట్వారం: మండల పరిధిలోని బొప్పునారం యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు సాయికీర్తన స్కూల్ లైబ్రరీకి పుస్తకాలు బహూకరించారు. ఇటీవల ఆమె 30 రోజులు ఆంగ్ల శిక్షణను బెంగళూరులో పూర్తి చేసి తిరిగి వచ్చారు. అక్కడి నుంచి ఆమె తీసుకొచ్చిన పుస్తకాలను లైబ్రరీకి బుధవారం అందజేశారు. ఆమె తీసుకువచ్చిన పుస్తకాలను విద్యార్థులతో ప్రదర్శించారు. ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం అంజమ్మ, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

బంట్వారం: విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ ప్రాథమిక పాఠశాలలో ముజీబ్ అనే ఉపాధ్యాయుడు నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ శాకం నర్సింలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల సంఖ్య మరింతగా పెంచేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులను ప్రైవేటు బడుల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రావణి, కృష్ణయ్య, రత్నయ్య, ఆనందం, బాగయ్య, హన్మంతు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

తాండూరు రూరల్: వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ....ముఖ్యంగా పల్లెల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, నర్సరీలపై దృష్టిపెట్టాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కొటబాసుపల్లి కార్యదర్శిగా శ్రావణి

మండల పరిధిలోని కొటబాసుపల్లి పంచాయతీ కార్యదర్శిగా శ్రావణి బుధవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. ఆమె గతంలో కులకచర్ల మండలంలో పని చేశారని చెప్పారు.

ప్రత్యేక పాలన.. అస్తవ్యస్తం!

- గ్రామాలకు వెళ్లని ప్రత్యేక అధికారులు
- కార్యదర్శులపై పెరిగిన పనిభారం
- పట్టించుకోని అధికారులు



ఐనాపూర్ గ్రామ పంచాయతీ భవనం

దోమ: గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఏదైన సమస్య ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గతేడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం విధితమే. గ్రామాల్లో సమస్యలు వచ్చినప్పుడు వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులపై పని భారం ఎక్కువవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 36 గ్రామ పంచాయతీలు

దోమ మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది జనవరి 31వ తేదీ వరకు సర్పంచుల పాలన కొనసాగగా, ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. దీంతో సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత వారికి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో వారూ గ్రామాల జోలికి వెళ్లడం లేదు. జీపీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఏదైన ప్రత్యేక కార్యక్రమం ఉంటే తప్పా ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నిధుల లేమితో ఇబ్బందులు

ప్రత్యేకాధికారుల పాలనలో కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో రాష్ట్రం నుంచి వచ్చే గ్రాంట్‌లు అంతంత మాత్రమే ఉండడంతో పాలన కష్టతరంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు. కనీసం పంచాయతీ వర్కర్లకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అంతేకాక మోటార్ల రిపేర్లు, వీధి దీపాల ఏర్పాట్లు, ట్రాక్టర్ డీజిల్ ఇతరత్రా ఖర్చులకు నిధుల సమస్య ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అప్పులు చేసి పనులు చేయించాల్సి వస్తుందని కార్యదర్శులు చెబుతున్నారు.

సమన్వయ లోపం

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు గ్రామ స్థాయిల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. కానీ ఈ విషయాన్ని ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రత్యేకాధికారులుగా ఉన్న మండల స్థాయి అధికారులు గ్రామాలకు రానప్పుడు తామేందుకు ఆరాటపడాలని వారు శ్రద్ధ చూపించడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో పాలన కుంటుపడుతుంది. చాలా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ఎవరనేది కూడా నేటికి తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతీ గ్రామంలో చెత్త, చెదారం పేరుకుపోవడంతో పాటు మురుగు ఏరులైపారుతుంది. ప్రత్యేకాధికారులు ఏనాడు గ్రామాలకు వచ్చి క్షేత్రాస్థాయిలో తిరిగి సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త, చెదారం

సమస్యలు పేరుకుపోతున్నాయి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారుల పాలనలో స్పెషల్ ఆఫీసర్లు లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలి. కానీ పలువురు అధికారులు గ్రామాలకు వెళ్లకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. దీంతో కార్యదర్శులే వారి సొంత నిధులతో పనులు చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా పలువురు స్పెషల్ ఆఫీసర్లు వారు నిర్వహిస్తున్న ప్రాంతానికే పంచాయతీ కార్యదర్శులతో రికార్డులను తెప్పించుకుని సంతకాలు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

– పవన్ యాదవ్, బొంపల్లి

పాలన కుంటుపడుతోంది



ప్రజలపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు. మొక్కుబడిగా ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేయడంతో వారు గ్రామాలకు ఎప్పుడు వస్తున్నారో? ఎప్పుడు వెళ్తున్నారో? తెలియని పరిస్థితి నెలకొంది. అటు గ్రామ పంచాయతీలలో నిధుల కొరత ఉండడం ద్వారా ఒక్కో పంచాయతీ కార్యదర్శి సుమారు రూ. లక్ష వరకు అప్పులు చేయాల్సి వచ్చింది. వాటిని చెల్లించే స్థితిలో ప్రభుత్వం లేదు. దీంతో గ్రామాల్లో పాలన కుంటుపడుతుంది.

– గోవర్ధన్, ఓబీసీ మోర్చా, మండల అధ్యక్షుడు

ఆదేశాలు జారీ చేస్తాం



గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శులకు సమావేశాలు ఏర్పాటు చేసి సూచిస్తాం. స్పెషల్ ఆఫీసర్లు సైతం గ్రామాల్లో సమస్యలు పరిష్కరింపజేసేలా ఆదేశాలు జారీ చేస్తాం. ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– నరేందర్, ఇంచార్జి ఎంపీడీఓ

గ్రామాల పురోగతే లక్ష్యం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి



రేగొండిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం రేగొండి గ్రామంలో రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ..పెద్దేముల్ మండలానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అన్నీ గ్రామాల్లో సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి రూ.2.95కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిరణ్, కొహీర్ రవి, విజయ్‌పటేల్, నర్సిములు, వైపూఫ్, యాదప్ప, బందెయ్య, మానయ్య, మహమూద్, అనంతయ్య, లింగేష్, పాపయ్య, చంద్రయ్య, ఖాజపాషా, వెంకటయ్య, రత్నంలు పాల్గొన్నారు.

వీరారెడ్డిపల్లిలో..

తాండూరు మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.8 లక్షలతో బంటు అమృతమ్మ ఇంటి నుంచి ఎపూరి గోపాల్ ఇంటి వరకు పనులు చేపట్టారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి కృషిచేస్తుందని పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో రూ.3లక్షల నిధులతో ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేవాలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చర్యలు తీసుకునేందుకు స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభ్యున్నతికి అందరితో కలిసి ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పాంబండ ఆలయ ఈఓ బాలనర్సయ్య, ఏపీఓ చంద్రశేఖర్, గోపాల్ నాయక్, జంగయ్య, అర్చకులు పాండు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



బాధిత వ్యక్తి వెంకటయ్యకు చెక్కు అందిస్తున్న మండల నాయకులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటయ్యకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరోగ్యశ్రీ క్రింద వర్తించని అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురైన వారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, నాయకులు జోగు వెంకటయ్య, రాము, చిన్నయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం తరలిన శివస్వాములు



దోమ: దోర్నాల్‌పల్లి నుంచి శ్రీశైల క్షేత్రానికి వెళ్తున్న శివస్వాములకు పాదాలు కడుగుతున్న మహిళలు

కొడంగల్ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ దీక్షను స్వీకరించిన శివస్వాములు బుధవారం ఇరుముడి కట్టుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. ఉదయం పట్టణంలోని గాడిబాయి శివాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, దూప, దీపం, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు

దోమ: శ్రీశైల మల్లికార్జున క్షేత్రానికి దోర్నాల్‌పల్లి నుంచి శివస్వాములు బుధవారం పాదయాత్రగా బయల్దేరారు. గ్రామంలోని శివాలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకుని శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా పయనమయ్యారు. గ్రామంలో ప్రజలు శివస్వాములను సాగనంపేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తితో కొందరు మహిళలు పాదాలను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు.



కొడంగల్ రూరల్: ఇరుముడులతో శివస్వాములు

శివాజీ యూత్‌కు విరాళం

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ ఏర్పాటుకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ మురళీకృష్ణగౌడ్ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణకు చత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బంట్వారం: రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ సందీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం మట్టి నమూనాలను సేకరిస్తామని పేర్కొన్నారు. దీనికోసం రైతులు మట్టి నమూనాలను తమతమ పొలాలనుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకురావాల్సిందిగా ఆయన సూచించారు. మట్టి నమూనాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ రూతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్



పండ్ల దుకాణ యజమానితో మాట్లాడుతున్న ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: రోడ్లపై చెత్త, కవర్లు వేసే వారిపై కఠిన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై వెలిసిన పండ్ల దుకాణాలు, హోటళ్లను పరిశీలించారు. రోడ్లపై చెత్తచెదారం వేయొద్దని సూచించారు. చుట్టు పక్కల పరిసరాలు చెత్తాచెదారంతో ఉండడంతో పండ్ల దుకాణ యజమానిపై ఆయన మండిపడ్డారు. రోడ్లపై ఎవరైనా చెత్తవేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు అధికారి సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

శివాజీకి ఘన నివాళి

నియోజక వర్గంలో ప్రతీ గ్రామంలో శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాలు, అభిమానులు ర్యాలీలు, శోభాయాత్ర నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. తాండూరు మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ శివాజీ వీరత్వం, పరిపాలనా దక్షత నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు.



పరిగి: శివాజీ శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు తదితరులు



అనంతగిరి: ర్యాలీలో బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత ప్రముఖ్ శివరాములు



కుల్కచర్ల బీజేపీ కార్యాలయంలో..



నవాబుపేట: ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



కొడంగల్ రూరల్: విగ్రహ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



తాండూరు: శివాజీ శోభాయాత్రలో యువత సందడి



తాండూరు రూరల్: శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కొడంగల్: శివాజీ శోభాయాత్ర



దోమలో శివాజీ యూత్ సభ్యులు..



మోమిన్‌పేట: మేకవనంపల్లిలో...



పూడూరులో బైక్‌ర్యాలీ